# ఖుదావంద్

లక్ష్మీకాంతం పారిపోయివచ్చి, మా యింట్లో దాక్కున్నాడు ....

పారిపోయి వచ్చాడంటే....వెంట ఎవరో తరుముకు వస్తూంటే, నురుగులు గ్రక్కుతూ పరిగెత్తుకుంటూ వచ్చాడనికాదు: దాక్కోడమంటే, ఎంతవెదికినా కనపడని ఏదో చీకటి గుయ్యారంలో నక్కి కూర్చోవడమూ కాదు....

—నిదానంగా నడిచివచ్చాడు....దొరకొడు కెవడురా! అన్నట్టు ఒళ్ళు విరుచుకు కుర్చీలో పడుకున్నాడు....

అయినా నాకు అలా అనిపించింది....వాడి నీడగా కొండంత భయం, పర్వతమంత ఆవేదనా కనిపించింది....

"ఏంరా?"....అని మౌనంగా కుశలప్రశ్న చేశాను....

"నేను తాగితే ఏం ఫరవాలేదుకదా!" అన్నాడు ఓ పట్టాన.... ఎవరినో అడుగుతూన్నట్టు....

"ఎవరికీ ఫరవా?"

'నీకు' అని మనసులో పలకడానికి నా వంక చూపు గిర్రున తిప్పి.... "నీకు అభ్యంతరము ఏమీ వుండదు కదా?" అని గొణుక్కున్నాడు.

"లేళ్ళు, పులులూ కలిసి పూరి మేసే పుణ్యభూమి యీ ఆశ్రమం అన్న సంగతి మరచిపోతే ఎలా?-మహారాజుగా సేవించు: నన్ను మటుకు సహపంక్తికి బల వంతపెట్టక: నే నిప్పుడే భోజనం చేశాను"....అని హెచ్చరించాను.

లక్ష్మీకాంతం....జేబులోంచి మందు సరంజామా తీసి....గంగతో అపవిత్రం చేయకుండా....దాహం పుచ్చుకున్నాడు.

మొగం జ్వరపు-మొగం పడ్డది.... కళ్ళు మెరుస్తున్నాయి .... అలా సిగరెట్టు కాలుస్తూ కాళ్ళూ, చేతులు చాచుకొని ఒక నిమిషం పడుకున్నాడు: "వడకొడుతూ వుంది గదూ"అని, పట్టివేళ్ళ తెరలు దించి....నీటిజల్లు తిప్పాను ....

"పోయిందిరా...."

రొదగా నిట్టూర్చాడనుకున్నాను మొదట .... మాట కదా అని మనసుకు తట్టింది.

ఎవరు?....ఎక్కడికి?....ఎందుకు ?....ఈ మూడింటిలో ఏదో ఒక్కటయినా, మాటధోరణిని అడగవలసిన ప్రశ్న....అడుగుదామనుకున్నాను కానీ, అడగకపోయినా జవాబు వాడంతట వాడే ఏలాగు చెపుతాడు కదా అనిపించి....విని ఊరుకున్నాను.

"శకుంతల లేచిపోయిందిరా అంటూంటే .... మాట్లాడవేం ?" అని వాడు దండించాడు....

శకుంతల అంటే....నాకు అర్థంకాలేదు.

"నామూలానే లేచిపోయింది...." అదే శ్రుతిలో అన్నాడు ....

"నీతోనే ఎందుకు లేచిపోలేదు ?" అని కొంటె విసురొకటి విసరమంది మనసు. కాని, వాడిలో ఆ బాధను చూసి, నా నోటికి జాలేసింది.

"అలాగా-పాపం" లాగా తల ఊగించాను.

"ఎవడితోనో, ఊరూ పేరూ లేనివాణ్ణి తీసుకొని ఎక్కడికో లేచిపోయింది...."

....లేచిపోయే ముందు, నాయకుడి పేరు ప్రఖ్యాతులు ఆలోచించవలసిన అగత్యం ఏమిటో నాకు ఎంతమాత్రమూ బోధపడలేదు. ఇదేమన్నా పెండ్లి సంబంధమా ఆర్షేయ పౌరుషేయములు నిదానంగా విచారించడానికి ? ఇంకొక విషయం కూడాను-ఇందులో వీడి నిర్వాహకం కొంత ఉందంటున్నాడుగా మరి. ఈ విక్షేప రాయడు ఒరిగించిందేమిటి ? .... తన చేతిమీదుగా ఈ సత్కార్యము జరుగుతూన్నప్పుడు, తాను, అంతమాత్రము మంచి చెడ్డలు ఆలోచించ నక్కరలా?....ఏమిటో అంతా అగమ్యంగా వుంది...

"మరి నా పెళ్ళాం ఎందుకు...."

...ఎందుకు లేచిపోలేదు?....అంటాడనుకున్నాను...వాక్యం సగంలో త్రుంచేసి నిద్రపోయాడు.

....నిద్రపట్టింది కాబోలు అనుకుంటూండే లోపుగానే .... నిద్రలో మునిగి తేలి బడలిక తీరినవాడిలాగా....ఒక్క నిమిషంలో తెరిపిగా మేలుకున్నాడు.

"ఏంరా, ఈ కోతిమొగాన్ని చూసి, కళ్ళున్న దేవతన్నా ముచ్చట పడుతుందటరా?"-వాడు దూకుడుగా అడిగాడన్నమాటే కాని, అందులో కొంత యధార్థం లేకపోలేదు. లక్ష్మీకాంతాన్ని, పరాకున అయినా, అందగాడనుకునేందుకు వీలు లేదు...."

"శకుంతల మధురమీనాక్షిలాగా కలకలలాడుతూ వుంటుందిరా. నేను ఎంత పుణ్యం చేసుకోబట్టో 'అన్నయ్యా' అని పిలిచేదిరా .... నాతో అరమరిక లేకుండా వుండేదిరా...."

ఓహో ఇప్పుడు అర్థమయింది: శకుంతలంటే మన వాడి యింటికి ఎదురుగుండా మేడలో క్రింది భాగంలో ఉంటున్నాదే .... తాసీల్దారు కూతురు. పిల్ల చాలా అందంగా వుంటుంది....చిదిపి దీపం పెట్టవచ్చు! అవును, నేను ఒకటి రెండుసార్లు చూసిన జ్ఞాపకం కూడాను....

"అన్నయ్యా అనే మాటకు ఎన్ని అర్థాలుంటాయిరా ?-నీవే చెప్పు"....

—ఏంచెప్పను? అందరికీ తెలిసిన ఆ ఒక్క అర్థమే నాకూ తెలుసును....ఈ నా అజ్ఞానాన్ని నా గ్రుడ్లు మిటకరించినవి....

—"అన్నయ్యా" అంటే 'బావా' అనీ, 'మామా!' అనీ అనుకోవచ్చునా ?-

చెల్లీ అని పిలుస్తూ, చాటునా మాటునా పెళ్ళాంగా వాడుకోవచ్చునా.... మనిషైనవాడు ఎవడన్నా అలా గడ్డి తింటాడా ?....పోనీ, మొగవాడు ఏ కోటిమందిలోనో ఒకడు పశువౌతాడనుకో....అప్పుడు మాత్రం - అదెలా పరిపాటి అవుతుంది ? ... వాడు పత్తి పశువుకాక మనిషెలా అవుతాడు?....

"అవును.... నీవంటూన్నదంతా నిజమే"నని తల ఊగించాను.

"నా పెళ్ళాం నన్ను శుద్ధ పశువుకింద కట్టింది...."

"శకుంతలను నేను ప్రేమిస్తున్నానని అనుక్షణమూ అభినందించడం మొదలు పెట్టిందిరా. అలాటి పాపపు మాట లనవద్దని ఎన్నోవిధాల బ్రతిమాలుకున్నాను : ఉహుఁ....తల్లికి పెళ్ళానికి తేడా తెలియని మనిషి—ఊ....మనిషా, అది కూడా ఒక మనిషేనా? ....

నన్ను తిట్టి దుమ్మెత్తిపోసినా అంత బాధపడేవాణ్ణి కాదేమో: నేను చెప్పేస్తున్నది ఏదో మనకార్యమని....నేనుకాదా అంత ప్రయోజకుణ్ణి కాగలిగానని, ఆవిడ అంటున్నప్పుడల్లా నా గుండెల్లో శూలాలు నాటుకునేవి.

నామీద ఎక్కడలేని దయ, ఆపేక్ష యింటావిడకు పుట్టుకువచ్చినవి ... దయతో చంపడం అని ఇంగ్లీషువాళ్ళు అనే మాటలో హాలాహలం నాకు నరనరాల ప్రాకిపోయింది.—శకుంతలకు మా ఆవిడ అభూయిత్యం ఎక్కడ తెలుస్తుందో....ఆ అమాయకురాలి మనసు ఎక్కడ చివుక్కుమంటుందో అని నాకు వెర్రెత్తిపోవడం మొదలుపెట్టింది.

కానీ, నేను ఏంచేయను? ఈ పాపపుమాట ఆ అమ్మాయి చెవిని పడకుండా చేయటం ఎలా? ఏమీ పాలుపోయింది...కాదు...తెంచుకు ఎక్కడికన్నా పారిపోతే ?... ఇహ మా ఆవిడ నోటికి హద్దూ పద్దూ ఉండదు .... పారిపోకుండా, ఇంటినే అంటి పట్టుకు వుంటే...ఏ నిమిషాన ఏం మునుగుతుందో?"

"శకుంతలను, మా యింటికి రావద్దని చెపుదునా? అయితే, కారణం ఏమనాలి?—

..."నీవు ఒక్కటి అడగవచ్చును... నీ పెళ్ళాం నోటికి బుద్ధి చెప్పలేకపోయినావా అని. అదీ ఆలోచించాను: నాకు తామసం లేకపోలేదు— నన్ను చూసి ఇకిలిస్తూ మా గృహలక్ష్మి ఓ వెకిలిమాట కూసినప్పుడల్లా, ఆ పళ్ళన్నీ ఒక్క వరుసన రాలేట్టు కొడదామా అనిపించేది...కానీ చేయి లేచేదికాదు ... ఏంచెయ్యను? అది నా

దౌర్భాగ్యం...పెళ్ళాన్ని కొట్టడం ఎప్పుడూ అలవాటులేదు ... చూసన్నా ఉండక పోతిని...మా నాన్న అమ్మమీద ఎన్నడూ చేయి చేసుకున్న పాపాన పోలేదు...

ఆవాళ శ్రావణ మంగళవారం. శకుంతల తలంటి పోసుకున్న నునుపుతో, కొత్తచీరా, రెవికా కట్టుకుని కలకల్లాడుతూ, వాడకట్టుకు పేరంటానికి వెడుతూ, మా గుమ్మంలోకి వచ్చింది. ఏం వదినా అని మా ఆవిడని కూడా రమ్మని కేకవేసింది. ఆవిడ చీరసింగారింపు ఇంకా తెమలలేదు కాబోలు, లోపలికి వచ్చి... నేను కూర్చున్న గదిలోకి తొంగిచూసి, వచ్చి కూర్చుని, ఏదో పత్రికలో బొమ్మలు చూస్తున్నది.

ఇహ కాస్సేపటికి .... మా ఆవిడ అక్కడకు వచ్చింది. వస్తూనే విషపు చూపొకటి చూసింది; ఆ వాలకం నేను చూశాను కానీ, శకుంతల బొమ్మల ధ్యానంలో వుండి, గమనించలేదు.

పోనీ, అంతటితో పోనియ్యవచ్చునా, లోపలకు వచ్చేందల్లా, గుమ్మం అవతలకు ఎగిరి గంతువేసి-ఆ విసురులోనే తలుపు ఛెళ్ళున వేసింది....

"శకుంతల వులికిపడి, తలఎత్తింది. ఏమిటని ఆ చూపులు నన్ను ప్రశ్నించినవి. నేను అర్థంకానట్టు....చూసి చూడనట్టే ఊరుకోగా,

"ఏమిటది?" అని పలికింది.

"ఏంలేదు, ఎక్కడినుంచో గాలివచ్చి.... ?"

"నాలుగు గోడల సందునా గాలి ఎల్లా విసురుతుంది ?"

"విసరదు—మసలుతుంది."

"మసలే గాలికి అంత అదిరిపాటుతనం వుండదు."

"ఐదవతనంతో పాటు అదరి పాటు తనమూను...."

"ఐదువరాలిచ్చిన ఆ ఐదువరాలి పేరేమిర...."

(శకుంతల ఎంతో బాగా పాడుతుందని చెప్పడం మరచిపోయినాను.)

"శకుంతలతో యతికి – ప్రతిగా ఇలా కొంటెగా మాట్లాడటం చాలా సరదాగానే వుంది. ఆ పిల్లదానికి అసలు కుళ్ళు ఎక్కడ అర్థమయిందోనని దిగులుగానూ వుంది.

నా గంద్రగోళం ఏమీ గమనించకుండా, శకుంతల సారంగపాణి చరణాన్ని మరో రెండుసార్లు సాగదీసి....

"తలుపు దగ్గిర నిలవేసి బ్రతిమాలితేగాని చెప్పవల్లేవుంది...." అని నవ్వుతూ మారాం చేసే పోణిమిలో నా చెయ్యి పట్టుకుని గుమ్మం దగ్గిరకు లాక్కు వస్తూంది. ఇద్దరము వెక—వెక—పక పక లాడుతున్నాము....

గుమ్మం రెండు రెక్కలూ దూది పింజలులాగా చెరో చెంపకు ఎగిరిపడి, పుస్తీలను బాదుకుని లబ—లబ లాడినవి....

నమిలి మింగేసేటట్టు మా ఆవిడ కణకణలాడుతూ నిలుచుంది — ఎదురు గుండా....

మాటలతో అయితే, ఎంత సేపు తర్జన భర్జన జరిగేదో, అవును కాదూలు ఎన్ని ఆవృతులు తిరిగేవో, ఎన్ని తిట్లు ఒట్లు గాలిలో కలసిపోయేవో సర్వత్రా ఎంత హైరాన చెలరేగేదో? ....

కాని మాటలకు అలవికాని శక్తి, ఒడుగు మౌనానికి వుంది.... మాటలు అర్థంలో ఆవగింజంత పాలును పలుకుతవి-మౌనం కొండంత దాన్ని ముక్తసరిగా ఉద్ఘోషిస్తుంది....

రెప్పపాటంతటిలో—పొంగి పొరలిన మౌనం, శకుంతలకు సంగతి అంతా విప్పి చెప్పింది....

"వదినా!"....అన్నది- కలలో మూలిగినట్లు....శకుంతల.

"చెల్లాయి"—అన్నాయి, నవ్వుగా మా ఆవిడ పాపపు పెదవులు....నా తల పాతాళంలోకి క్రుంగిపోయింది....

"ఎన్ని యుగాలకో" నేను మళ్ళా తెప్పరిల్లి తల ఎత్తి చూసేటప్పటికి....మా ఆవిడ మొగమే చూశాను: శకుంతల....లేదు.

"పొరపాటున తలుపు తోశానండి" అన్నది ఆ ఇల్లాలు. నా బాధ పరమాత్ముడి కైనా అర్థంకాదు....నదురూ బెదురూ లేకుండా అన్న ఒక్క ముక్క నన్ను రాక్షసుణ్ణి చేసింది. మెడ నులిమేస్తే మెదడును కసకస నమిలి తినేస్తే - ఏం చేస్తే మటుకు ఏం లాభం? - ఏం చేసినా ఒక్కటేగా అయేది?—చచ్చి ఊరుకుంటుంది. కానీ, రౌరవంలోకి శాశ్వతంగా ఈ అబద్ధాన్ని వెంటపెట్టుకు పోతుంది....ఆ రాకాసిని హత మార్చడానికి భయపడ్డాను—

"శకుంతల నా కంటికి అగుపించలేదు.

"ఎవిన్నవడినో తీసుకుని లేచిపోయింది—

"ఈ శుభ వర్తమానం మా ఆవిడ నోటి మీదగానే తెలిసింది—

"శకుంతల మా ఆవిడకు ఉత్తరం వ్రాసిందిరా. అందులో పంక్తులు చింత నిప్పులయి మండుతున్నాయిరా...."

"వదినా, అన్నయ్యను వరించాననుకున్నావు కాదూ?-నీకు అలా రాసిపెట్టింది గాని, అలాటి కోతి మొగాన్ని కట్టుకోవలసిన కర్మ నాకేం పట్టిందమ్మా? ఏరి కోరి నా యిష్టం వచ్చిన వాడితో నేను లేచిపోతున్నాను.

నీతో మాట్లాడటమంటే సరదా; నీతో సరస మాడటమంటే సరదా, నీవంటే నాకు తగని సరదా -

నీవు ఏమనుకొని పోతావో అని, నీ మనసు ఎక్కడ నొచ్చుతుందో అని.... నీ కోసం, ఆయన్ని అన్నయ్యా అని పలుకరించేదాన్ని కానీ, మీ ఆయనంటే నాకు తగని రోత సుమీ! ఉన్నమాట అన్నందుకు ఉలికిపడ్డావా వదినా?"

"ఈ ఉత్తరం చదివి మా ఆవిడ ఏనుగు నెక్కిందిరా! నా విషయంలో లేని పోనివన్నీ అనుకున్నందుకు ఎంతో కించ పడ్డదిరా - మా కౌగిలింతలో నలిగి మన్మధుడి దుంప తెగిపోయిందిరా—

ఏమీ అనలేక .... ఏమీ చేయలేక, ఆ బాహుపంజరంలోంచి ఎలాగో తప్పించుకు వచ్చి యిక్కడ పడ్డారా—"

— లక్ష్మీకాంతం అయోమయంగా నిట్టూర్చి.... పక్క కుదరని వాడిలాగా కుర్చీలో కొంత సేపు యాతనగా అటూ యిటూ మసిలాడు. గాజు కుప్పెలో కురుదల తీర్థాన్ని సేవించాడు....క్రమంగా మొగంలో వేడి—ఎరుపు దిగిపోయింది. మనిషి తేరుకున్నాడు.

"శకుంతల నాకోసం ఎంత త్యాగం చేసిందో చూశావా?" అన్నాడు స్వగతంగా.

"నా కాపురం చెడిపోతుందేమోనని, తన పరువును, తన వాళ్ళ పరువును

నష్టేట కలిసింది. ఇలా చేయకుండా, ఇంటిపట్టునే ఉండి, ఎన్ని ప్రమాణాలు చేసినా, మా ఆవిడ....నమ్మదని శకుంతలకు తెలుసును. కానీ, ఎంతపని చేసిందిరా- వెర్రిపిల్ల, నా కాపురం తగులడిపోతే మాత్రమేం, వెయ్యేళ్ళు వర్థిల్లాలిసిన బంగారుతల్లి...."

"ఇదంతా మీ ఆవిడమీద అభిమానమేమో...."

"ఆఁ....వల్లకాడు: ఆవిడంటే శకుంతలకు తగని అసహ్యం....నా కోసమని ఆవిడని మెచ్చుకుంటూ ఆ అబద్ధాలన్నీ వ్రాసింది .... సరే కాని, ఇప్పుడు ఏమిటి చేయటం?...."

లక్ష్మీకాంతం ఉరిమిచూస్తూ ప్రశ్నించాడు. పదే పదే ఏం చెయ్యమనడానికి నాకేమీ పాలుపోలేదు....సలహా ఇవ్వకుండా ఊరుకునేందుకు అంతకన్నా వీలులేదు ఆ స్థితిలో.

"ఇంటికి మాత్రం వెళ్ళను ఇహ- ఏమయినా సరే. మా ఆవిడ భూతంలా పట్టుకుంటుంది. అది పతివ్రత కావడం కూడా నా ప్రాణానికే వచ్చింది. ఎర్రగా బుర్రగా ఉన్నవాణ్ణి ఎవడినన్నా తీసుకొని లేచిపోదేం?—"

నాకు నవ్వు వచ్చింది. కానీ, వాడిబాధ అర్థమైంది....

"పోనీ, అలా సలహా యివ్వరాదూ ?" అన్నాను .... ఆలోచన చెపుతూన్నట్టు.

"చెపితే నవ్వుతుందిరా...." వాడి అవస్థకు తగని జాలి- వేస్తూంది. అమాయకుడికి అతి తెలివితేటలు వున్న పిల్లను యిచ్చి పెళ్ళిచేయడం ఎంత అనర్థమో నాకు ఇప్పుడు బోధపడింది....

"ఏంరా, పాప పరిహారార్థం....నేను చెప్పినపని చేస్తావా?" అన్నాను : వాడు ఎగిరి గంతేసినంత అప్రమత్తుడయినాడు.

"ఎవరితెనన్నా కుర్రదాన్ని వెంట వేసుకొని కొన్నాళ్ళపాటు తీర్థయాత్ర చేసిరా...."

....నేను వెక్కిరిస్తున్నాననుకున్నాడు....

"నిజంగానే చెపుతున్నాను భాయీ; శకుంతలకు అపచారం చేశాననుకుంటు న్నావు కానీ, నీ స్థితి మరీ శోచనీయమన్న సంగతి మరచిపోతున్నావు. మీ ఆవిడ

దృష్టిలో నీ వో పసిపాపవు: పిల్లాడిని గారాబం చేసినట్టు చేస్తూంది: తల్లిలాగ పెంచు తూంది - నీ యిల్లాలు నిన్ను — ఇది నీ మగసిరికి పరువా? శకుంతలకు ఏదో నీవల్ల అపచారం జరిగిందనుకుంటున్నావు. కాని, నీవు ఎంత అర్భకుడి వై పో తున్నావో ఆలోచించడంలేదు....మడిగట్టుకు కూర్చున్న మగవాడిమీద ఆడదానికి మమత ఉండదురా-మొగుడు కొరగానివాడయితే, ఇక ఆ యిల్లాలి ఆనందానికి పట్ట పగ్గాలు వుండవు. తనకు దక్కకపోతున్నాడనే బాధతో ఆమె మైమరచి పులకరించు తుంది. తన కౌగిలిలోకి లాక్కునేందుకు మన్మథుడూ, వసంత మాధవులూ ప్రసా దించిన వలలన్నీ పన్నుతుంది....ప్రేమిస్తుంది.

శకుంతలకు వున్న తెగింపైనా నీకు లేకపోతే ఎలా?-లే, ప్రయాణం కట్టు!"

ఆకు నందకుండా, పోకను పొందకుండా, కోమటి పురాణంలాగా దీర్ఘోప న్యాసం చేశాను....లక్ష్మీకాంతం నాకు గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్నాడు.

"అయితే, యింతకూ నన్ను ఏం చెయ్యమంటావు ?" అన్నాడు - ఎప్పటికో తెప్పరిల్లి.

"ఏంచేసినా సరే....కానీ, యిలా హాలాహలం మ్రింగుతూ కాలం గడపటం మాత్రం వద్దు...."

"త్రాగకపోతే, శకుంతల జ్ఞాపకం వస్తుంది....త్రాగితే .... మా ఆవిడ చేసిన ద్రోహం జ్ఞాపకం వస్తుంది .... త్రాగి మరచిపోదామనుకున్నాను .... అదీ సాగడం లేదు...."

"త్రాగుదామనే సంగతి మరచిపో....అప్పుడు ఇద్దరూ జ్ఞాపకంరారు ...."

"మా ఆవిడ నన్ను మరచిపోయినా బాగుండును."

"నిన్ను మరచిపోతే, ప్రొద్దుపోవడం యెలా ?...ఎక్కడున్నా వెదుక్కుంటూ వస్తుంది..."

"అవును, అది అంతదీబోను"

....నేను 'అలాగా' అని తల ఊగించాను.

—సంజెవేళ అవుతూంది: ఇద్దరమూ అవీ యివీ తిని కాఫీ పుచ్చుకుంటు

న్నాము. లక్ష్మీకాంతం భార్య లోపలికి చక్కా వచ్చింది. అవిడను చూసీ చూడటంతోనే మన ధీరుడు కుర్చీతోసహా గజగజలాడిపోయినాడు. కేవలం పిల్లి అయిపోయినాడు.

—"సినీమాకు వెళదాం, రండి" అన్నది కోమల స్వరంతో, పల్లెటూరి బడి పంతులు అదమాయింపుతో.

"నాకు....ఒంట్లో ఏమీ బాగుండలేదు...." అన్నాడు నీరసంగా.

"మరి....బీచికి పోదామా?"

"నాకు....మనసేమీ బాగుండలేదు."

"అలాగా?....అయ్యో పాపం! అలా అయితే ఎక్కడికీ వద్దు, యింటికే పోదాం...."

"....నీవు వెళ్ళు: నేను కొంచెం సేపుండి ...."

—చేయి అందిచ్చి, పసివాడినిలాగా పొదివి పట్టుకుని నిలవేసింది: వెళ్ళి వస్తామని నాతో చెప్పి, మెల్లిగా సందిట నడిపించుకుంటూ వెళ్ళి, కారులో కూర్చోవేసింది....డ్రైవరుతో, ఫలానా సినీమాకే పోనీమంది.

....మలుపు తిరిగి మాయమయేదాకా కారువెన్ను పరధ్యానంతో పరకాయించి చూస్తూ....మెట్లమీదనే అలా నిలువబడిపోయి ఉండి, లోపలికి వెళ్ళిపోయినాను.

....ఖాళీసీసాలు, గ్లాసులూ ఉగ్గు గిన్నెలులాగ తోచినవి. వాడు ఇందాకటి నుంచి కూర్చున్న కుర్చీ ఉయ్యాలై....పొత్తిళ్ళలో పడుకుని, ఉంగా-ఉంగా ంఅటూ, కాళ్ళూ చేతులూ తొట్టి గిలకలకువేసి కొట్టుకుంటూ, తల్లి ఆశాశపెట్టే గిలకపండు అందుకునేందుకు వంకర చేతులు పిడికిళ్ళతో జాపే ఆముదపు గుడ్డలులాగా .... కందగడ్డలాగా....వున్నాడు లక్ష్మీకాంతం.... అవును, కొన్ని జీవితాలకు ఎప్పటికీ పురుడు వెళ్ళదు.

—మొన్న ఈ నడుమ .... ఎప్పుడో ... ఆల్బర్ట్ హాలులో భరతనాట్యం చూస్తూంటే...అవతల ఆ చివర కూర్చుని వున్నారు... దంపతులు. ఇద్దరూ చిలకా గోరింకలలాగ నవ్వుతూ త్రుళ్ళుతూ కిక్కిరిసి కూర్చుని తదేక దీక్షతో ప్రదర్శనంలో నిమగ్నులై యున్నారు.

లక్ష్మీకాంతాన్ని చూసి, ఎక్కడ జాలిపడతానో అని....భయమేసింది....